# ఆ టూ, పో టూ

[ క థా ని క ]

❀

= శ్రీ రామచంద్రకాశ్యప =

"ఇటు చూడండి! దేనికండీ నాపైన యీనిర్దయ? నే నేం ద్రోహం చేశాను? అగ్నిసాక్షిగా పెళ్లాడిన నన్ను స్వీకరించమని ప్రార్థిస్తున్నాను. ఈ మంగళ సూత్రం నాకు కట్టింది మీరు. దీన్ని చూచయినా నన్ను మీ భార్యగా—చివరకు, దాసిగానైనా తీసుకోండి" అని బతిమాలాను. కాని నామాటలు ఆయన చెవికెక్క లేదు. వికృతంగా నవ్వి, "ఏమిటీ, ఈ మంగళసూత్రం నేను కట్టానా? అందుకని నీవు నాభార్యవా? హ హ! అయితే నేకట్టిన సూత్రాన్ని నేనే తెంపేస్తాను, నీయిష్టమొచ్చిన చోటుకుపో" అంటూ నామంగళసూత్రాన్ని తన పిడికిటితో తెంపి తన యినప కాలిబూటుతో గట్టిగా నాముఖంమీద తన్నాడు. ఆదెబ్బతో నే నాపయిమెట్టునుండి క్రిందవరకూ దొర్లుకొంటూపోయాను.

అయిదారు నిమిషాలవరకూ నాకు స్పృహ వచ్చిందికాదు. నాముఖంమీద గాయమై రక్తంకారుతోంది. నాముందర మంగళసూత్రం పడవేసివుంది. ముఖద్వారంతలుపు మూసివుంది. లోపలనుండి అస్పష్టమైన మాటలూ, నవ్వులూ వినిపిస్తున్నయి.

ఆమంగళసూత్రం చూస్తూవుంటే గుండె తరుక్కుపోయింది. కళ్లవెంట వేడిబాష్పాలు ప్రవహించాయి. దాన్ని చూసినకొద్దీ వెనుకటివిషయాలన్నీ ఒకదానివెనుక ఒకటి పరిగెత్తుకొనివచ్చాయి. నా చిన్నతనం, చదువూ, పెళ్లీ, యింకా యెన్నో.......

* * *

మా నాన్నకు నే నొక్కతెనే కూతుర్ని. తల్లి నా చిన్నతనంలోనే పోయింది. మొదటినుంచీ గారాబంగా పెంచుతూవచ్చాడు. మాది పల్లెటూరు. అందులోనూ ధనవంతుని ఏకపుత్రిక నవడంచేత ఒక స్వర్గంలో పెరిగినట్టు పెరిగాను. కష్టమంటే యేమిటో నాకు తెలియదు. మా నాన్న నాకు నాల్గవ ఫారం వరకూ ప్రయివేటు చెప్పించాడు. పదమూడవయేడు రావడంచేతనూ, ఇంకా సంఘములో సంస్కరణ ప్రబలకపోవడంచేతనూ, మా నాన్న నా పదకొండవ ఏటినుంచీ సంబంధం వెదక నారంభించాడు.

భాగ్యవంతు లయినా వరులు వెంటనే దొరకరు. వరునిలో యే ఒక్కగుణం లోపించినా తండ్రికి నచ్చదు. ధనం, చదువు, రూపం, సంప్రదాయం, గుణం—అన్నింటిలోనూ బాగా వుండాలి. నాకోసం నా తండ్రీ, ఆయనస్నేహితులూ యిటు మద్రాసు నుంచి అటు విజయనగరంవరకూ వెతుకుతూవచ్చారు. చివరకు మా అదృష్టవశంవల్ల — కాదు, మా దురదృష్టవశంవల్ల — యివన్నీ వున్నవని మానాన్న అనుకున్నవరుడు దొరికాడు.

అతనితండ్రి రిటైర్డు డిప్యూటీ కలెక్టరు. రిటైరయిన తర్వాత మదరాసులోనే కాపరం పెట్టారు. కొడుకును బి. ఏ. వరకూ చదివించారు. ఒక్కడే కొడుకు. పరీక్షలో గొప్ప మార్కులు కూడా వచ్చాయిట. లోటులేని రూపం. ఈ వరుడు మా నాన్న కళ్లబడేవరకు రెండేళ్లు పట్టింది. సరిగ్గా నాకు పదమూడవ ఏడు వచ్చింది.

వారు నన్ను ప్రథమం చూట్టానికి వచ్చిన విషయం యింకా నేను మరచిపోలేదు. పై రూపాన్ని తిలకించిన నాకు వారు నవమన్మథులు లాగా కనిపించారు. వారు కూడా నా రూపమందు సందేహం కనబరచలేదు. పిల్లవిషయంలో తన

అభ్యంతరం లేదని అక్కడే చెప్పేసినారు. ఇక కట్నమూ, లాంఛనాలూ తేలవలసి యున్నవి. అవి వియ్యంకులు తేల్చుకోవాలిగాని మాకు సంబంధించిన విషయం కాదుగా!

కట్నంకూడా తేల్చుకున్నారు. కట్నంవిషయమై నాకు చెప్పినప్పుడు యిది కట్నమా, ఆస్తిదోపిడియా అనిపించింది. ఇరవైయైదువేల రూపాయల కట్నం సరిగ్గా ముహూర్తముముందు ఖంగున వారిచేతిలో పొయ్యాలి. అల్లునకు ఐ. సి. యస్. ఖర్చు మాదే. తక్కిన ఆస్తిలో సగభాగం నాకు వెంటనే రాసియివ్వాలి. ఇవి కండిషన్లు. మా నాన్న సంతోషంతో కాకపోయినా తొందరలో అయిపోతుందిగదా అని అందుకు ఒప్పుకొనవలసివచ్చింది. ఇక రెండునెల లుంది పెళ్లి. మా నాన్న ఆ మర్నాటినుంచీ పెళ్లిప్రయత్నాలు ప్రారంభించాడు. ఊరంతా మానాన్నకు తగిన సాయం చేశారు. ఆడవాళ్లంతా–చిన్నలూ పెద్దలూ సరసాలాడి నన్ను ఆనందింపజేశారు. ఆరెండునెలలూ స్వర్గంలాగా వుంది. ఇప్పుడే యిలా వుంటే యింక పెళ్లయినతర్వాత యింకెంత ఆనందంగా వుంటుందో అని సంబరపడ్డాను. కాని.........

పెళ్లిరోజు వచ్చింది. పెళ్లివారు అంక్రితం రోజున వచ్చారు. వారికి జరగవలసిన సపర్యలన్నీ మా నాన్న జరిపించాడు. ఆరాత్రి నాకు స్వర్గ ద్వారములముందు కూర్చొని యెప్పుడు తెరుస్తారా అన్నట్లు అనిపించేది. "పెళ్లికూతురు ఏదీ" అని ఎవరైనా అంటూంటే నావొళ్లంతా పులకరించేది. ఉదయం ఎనిమిదిగంటలకు లగ్నం. కాలం ఆగుతుందా? ఎనిమిది గంటలనే సమయం రాకమానదు. మానాన్న పెళ్లి పనులంతా తనస్నేహితులమీద పడవేసి తాను డబ్బుకోసం వెదక నారంభించాడు. ఎంత ధనవంతుడయినా యిరవై అయిదువేలు రెండునెలలలో దొరకాలంటే కష్టమనిపించింది. ఎన్నిటికని తిరుగుతాడు? ఇటు పెళ్లి పనులు, అటు బంధువులను పిలవడం, యిదిగాక అప్పుకోసం యాచించడం. పెళ్లిసమయానికి యిరవయివేలు మాత్రం తేగలిగాడు. ఆస్తిపరుణ్ణిగదా, తన మాట మీద అంతమాత్రం నమ్మక ముంచరా అని భ్రమ పడ్డాడు. కాని...............

మా మామగారు అంతా తక్షణం కక్కవలసిందేనని పట్టుపట్టారు. మా నాన్న బతిమాలుకున్నప్పటికీ వినక, నలుగురూ వినేటట్టు అరవడం ప్రారంభించారు. చదువుకొని, నవీనభావాలు కలిగి కూడా యేమీ మాఋమాట చెప్పని నా భర్తమీద నాకు చాలా కోపం వచ్చింది. తనతండ్రిని తానెందుకు ఆపగూడదు? మా నాన్నను నలుగురిలో అలా అవమానం చేస్తూవుంటే తా నూరుకోవడం నిర్దయ అనిపించింది. కాని ఏంచేస్తాం? వారు అత్తవారు, మేము పుట్టింటివారం.

అయిదువేలకోసం పెళ్లి ఆపదలచుకోలేదు. వెంటనే అయిదువేలకు ఒక ప్రాంసరీనోటువ్రాసి ఆయన చేతిలో పెట్టాడు. ఈ వెధవకాగితం యెవడిక్కావాలని కొంతసేపు గొణిగినప్పటికీ, చివరకు ఆయన దయవల్ల — కాదు, ఏనాడో నేను చేసుకొన్న పాపంవల్ల — ఒప్పుకొన్నాడు. పెళ్లి జరిగిపోయింది. ఎవరికి వారు కులాసాగా యిండ్లకు వెళ్లిపోయారు. నేనుకూడా మావారితో మద్రాసులో మూడురోజులుండి, మళ్లీ తిరిగివచ్చాను. నాతోపాటు నా భర్త కూడా మావూరు వచ్చి మూన్నాళ్లుండి మద్రాసు వెళ్లిపోయారు. ఒక నెలవరకూ నా కాళ్ల బడలికా, ఆ సర్దా తీరలేదు. మా నాన్న కూడా పెళ్లయింతర్వాత పదిరోజులవరకూ పడకనుండి లేవలేదు. ఆ తర్వాత జీవితం మామూలుదారిలో పడ్డది. నా మెడలో మంగళసూత్రం, అప్పుడప్పుడూ మద్రాసు నుండి వచ్చే వుత్తరాలూ తప్ప, పెళ్లికిముందూ, పెళ్లికి తర్వాతా నాకు భేదమే కనపడలేదు.

నాకు పెళ్లయింది వేసంగి సెలవల్లో. సెలవలవంగానే వారు ఐ. సి. యస్. చదవడానికి యింగ్లాండు వెళ్తారు. దానికి కావలసిన ధనం చేకూర్చుకొని వారం రోజులముందే మద్రాసుచేరాం. మే మావారంరోజులూ చాలా ఆనందంగా గడిపాము. నేను నాల్గయిదుసార్లు వారితో మాట్లాడడానికి ప్రయత్నించిచూశానుగాని ధైర్యంచేయలేకపోయాను. నన్ను అదీ యిదీ తెమ్మని వారు ప్రోత్సాహపరచినా చెప్పినపని చేయడం తప్ప వారితో సంభాషింపలేకపోయాను. నన్ను ఒంటరిగా

వుండటం చూసి సినిమాకు రమ్మని పిల్చారు. దాంతో నావొళ్లంతా ఒక్కసారి జలదరించిపోయింది. ఒక్క గంతున నేను అక్కడినుండి పరిగెత్తుక పోయాను.

వారంరోజు లయింతర్వాత వారు మెయిలు మీద బొంబాయి వెళ్లారు. అటనుండి ఓడమీద లండను వెళ్తారు. నేనూ, మా నాన్నా, వాళ్ల నాన్నా, వారి విధవచెల్లెలూ రైలుదాకా వెళ్లాం. ఆ రోజున ఎంత అందంగా వున్నారూ! నావంక చూసి ఎన్నిసార్లు నవ్వారు! అవన్నీ యిప్పుడు తల్చుకుంటే అదంతా కలా, నిజమా అనిపిస్తోంది. రైలు బయలుదేరింది. "వెళ్లొస్తాను శ్యామలా" అన్నారు. సిగ్గుతో కుంగిపోయాను. రైలు దూరమౌతున్న కొద్దీ నాహృదయం బరువయింది. నాకళ్లవెంట అప్రయత్నంగా కన్నీరు వచ్చాయి. మా నాన్నా వాళ్లూ చూస్తారేమోనని ముఖం తిప్పుకున్నాను. వాళ్లుకూడా విచారంలో వుండడంచేత నా స్థితి గమనించలేదు. మామామగారు కొంతసేపయిన తర్వాత "సరే, పదండి" అన్నారు. నడవలేక నడవలేక మేం నడిచాం. కారుమీద యింటికి చేరుకున్నాం. ఆరాత్రంతా నాకు నిద్రేలేదు. వారిచేష్టలూ, మాటలూ ఒకటివెంట ఒకటి నామనస్సులో గిరగిరా తిరుగుతున్నయి. అన్నిటికంటే "వెళ్లొస్తాను శ్యామలా" అన్నమాటే నా ఆనందానికీ, అశాంతికీ కారణమయింది.

అల్లుడి కోరికప్రకారం బెజవాడలో కాపరం పెట్టి, నన్ను అయిదవ ఫారంలో చేర్పించారు. నెలనెలకూ మా నాన్నగారు డబ్బు మనియార్డరు చేయడం, పదిహేను రోజులకోనాడు తాను కులాసాగా ఉన్నానని ఆయన ఉత్తరం రాయడం తప్ప వేఱే సంఘటనలేమీ నన్నాకర్షించలేదు. శ్యామ లెలా వుందనీ, ఆమెకు నా ప్రియమైన ముద్దు లనీ ఏమిటేమిటో వ్రాసేవారు. రెండు మూడు ఉత్తరాలు నాకే ప్రత్యేకంగా వ్రాశారుకూడాను. ఆ లండను దృశ్యాలు, ఆ జీవితసౌమనస్యం, ఆ డిన్నరుపార్టీలు, ఆ హాయీ విపులంగా రాశారు ఆ వుత్తరాల్లో.

జీవితం త్వరత్వరగా వెళ్లిపోయింది. ఒక ఏడు, రెండేండ్లు, మూడేళ్లు జరిగిపోయాయి. మా నాన్న ఒక యంత్రంలాగా, మెకానికల్‌గా డబ్బు పంపించడం, ఆయన పదిహేను రోజులకో, నెలకో ఒకవుత్తరం రాయడం! చివరకు ఆయనకు డబ్బు కావలసివస్తేనే ఉత్తరం రాసేవారు. లేకపోతే మానేసేవారు. వారి ఉత్తరాల్లో విపరీతపుమార్పు కనబడింది. చాలా ఉత్తరాల్లో నాపేరే వుండదు. నన్ను గూర్చి ఒక్క వాక్యంకూడా లేకపోవడం నాకు చాలా విచారాన్ని గూర్చింది. పరీక్షతొందరలో నన్ను మరచిపోయారని భావించాను. కాని...

ఐ. సి. ఎస్. లో వారు సెలెక్టవలేదు. ఇది మా కందరికీ ఓ పెద్దదెబ్బగా పరిణమించింది. దీనికోసం అనేకవేలు బూడిదపాలయాయి. అంతటితో వారు సంతృప్తిపడలేదు. "లాపరీక్షకు అప్పియర్ అవుతున్నా" ననీ, "అది అవంగానే యింటికి వస్తా"ననీ వుత్తరం రాశారు. దానికికూడా ఎలాగోలాగు డబ్బు సర్దారు మా నాన్న.

ఇంతలోకే మామామగారికి పెద్దసుస్తీచేసింది. రాచకురుపు లేచి ఆయనను నానాబాధలూ పెట్టింది. మే మంతా మద్రాసు వెళ్లాం. లండనులో మావారికి టెలిగ్రా మిచ్చారు. "తగుజాగర్త తీసుకోవలసిం" దని మా నాన్నకు తిరుగుటెలిగ్రా మిచ్చారు. కాని అది ప్రాణాపాయమయిన కురు పయిపోయింది. డాక్టర్లు పెదవి విరిచారు. రెండునెలలు తీసుకొని తీసుకొని ఆయన పరమపదించారు. ఆ వార్త శాంతవాక్యాలతో మా నాన్న మావారికి వుత్తరం వ్రాశారు. నేనుకూడా నావిచారాన్నీ, ప్రేమనూ జతపరిచి వారికి తెలియజేశాను, ఆ వుత్తరంలో.

పరీక్ష లయిపోయినయి. ఉత్తీర్ణుడ నయినాననీ, తన తండ్రిగారి ఆస్తిలోనుండి ఒక ఏభయివేలరూపాయలు తనకు పంపించాలసిందనీ వుత్తరం రాశారు. అంతడబ్బుఆయనకు పంపించడానికి భయపడ్డప్పటికీ తన డబ్బువిషయంలో నీ అథార్టీ ఏమిటని ప్రశ్నిస్తాడేమోనని భయపడి అతనికి కావలసిన డబ్బు బాంకులో రాబట్టి పంపించాడు. మామామగారు ఆయనకు వదలిపెట్టినదల్లా బాంకులో రెండులక్షలరూపాయలనిల్వ, మద్రాసులో మేడ, దానిలోనున్న సామాను. ఈ

ఏభయివేలూ పంపించినతర్వాత మాకు వారినుండి మరి వుత్తరంరాలేదు. మానాన్న తర్వాత రెండు మూడుఉత్తరాలు రాశారు. ప్రత్యుత్తరం రాలేదు. నాచేతకూడా ఒక వుత్తరం రాయించారు. ఫలితం శూన్యం. ఎడ్రసు మార్చారా ? ఇంగ్లాండునుండి బయలుదేరారా? ఆ విషయమై ఎందుకు వుత్తరం రాయరు? ఏభైవేలూ చేరినట్లు రసీదు వచ్చింది. భారం భగవంతుని మీద వేసి మెదలకుండా వూరుకున్నాము.

అప్పటికి నాకు ౧౮ ఏళ్లు వచ్చాయి. యఫ్. ఏ. పూర్తి చేశాను గుంటూరులో. నాభర్త యింగ్లాండులో చదువుతూవుండటంచేత నాకు గౌరవ మెక్కువయింది ఆ కాలేజీలో. వారు వచ్చే రోజు సమీపించినకొద్దీ నా మనస్సులోని వూహలూ, వాంఛలూ అభివృద్ధి కావడం ప్రారంభించాయి. ఇంతలో వారి దగ్గరనుంచి వుత్తరం లేకపోవడం నాకు విచారాన్ని కలుగజేసింది. ఆ ఏభయివేలూ పంపించ మనడంలో అర్థం అక్కడ వుండిపోదా మనా ? ఏమో, మా కర్థం కాలేదు. కాలమే నిర్ణయిస్తుం దనే ఆశతో ఆ ప్రమేయం మరి వదలుకున్నాం.

రెండు మూడు నెలలు గడచిపోయాయి. మా నాన్న పూర్తిగా ఆశ వదులుకోక యింకా రెండు వుత్తరాలు రాశాడు. కాని జవాబు లేదు. ఇంగ్లాండుకు ఇంజనీరింగు చదవడానికి ఒక స్టూడెంటు వెళ్తూవుంటే అతనితో తన అల్లుణ్ని గురించి కనుక్కోమని నొక్కి నొక్కి చెప్పానని చెప్పాడు. దాంతో కొంత ఆత్మశాంతి కలిగింది. ఆ ఇంజనీరింగు స్టూడెంటు లండను వెళ్లడానికి రెండు మూడు నెలలు పట్టినా ప్రతిరోజూ పోస్టుమాన్‌ను అడిగేదాన్ని - వుత్తర మేమయినా వచ్చిందా అని.

ఇలా ఆదుర్దాతో, ఆశతో అయిదారు నెల్లు గడచిపోయినయి. ఒకరోజు మధ్యాహ్నం. ఇంకా మా భోజనాలు కాలేదు. మానాన్నను భోజనానికి లెమ్మని పిలవడానికి ఆయనగదిలోకి వెళ్లాను. టేబిలుమీద తలకాయ పెట్టి ఏదో దీర్ఘాలోచనలో ఉన్నాడు. "నాన్నగారూ! భోజనానికి లెండి" ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. నావైపు తిరిగిచూచాడు. కళ్లు చింతనిప్పులలాగా వున్నయి. ముఖమంతా వివర్ణమైఉంది. కన్నీళ్లు చెంపలమీదుగా ప్రవహిస్తున్నయి. మళ్లా టేబిలుమీద తల పెట్టి భోరుమని యేడ్చాడు. ఈపరిస్థితి నాకేమీ అర్థం కాలేదు. దగ్గరకు వెళ్లాను. "ఏమిటి నాన్నగారూ"అని అరిచాను. వారియెదుట ఒక ఉత్తరముంది. దానిపైనస్టాంపు చూస్తే అది యింగ్లాండునుంచి వచ్చినట్లు తెలిసింది. వెంటనే నామనస్సులో అనేక వూహలు పరిగెత్తాయి. "వారి కేమైనా ప్రమాదమా ? జీవించివున్నారా?" ఈ భావాలు నామనస్సులో అశాంతిని నెలకొల్పినయి. ఆవుత్తరం తీసి చదివాను. దానిలో యిలా వుంది:

"బాబుగారూ, మీ కింత ఆలస్యంగా రాస్తూవున్నందుకు క్షమించాలని కోర్తాను. మీ అల్లుడివిషయమై నేను వాకబుచేశాను. నాకు తెలిసిన విషయాలు మీకు రాయాలో, రాయకూడదో తెలిసిందిగాదు. మిమ్మల నవసరంగా దుఃఖసముద్రములో ముంచుతున్నానని భయంగా వుంది. కాని మిమ్ములను నిరంతర సందేహములో వుంచేకన్నా నిజం చెప్పివేస్తేనే మంచిదనే భావంతో నే నీ వుత్తరం రాస్తూవున్నాను. మీ అల్లుడు యిండియాకు బయలుదేరి ఆరు నెలలయింది. అతనివెంట ఒక తెల్లపిల్లకూడా వెళ్లింది. ఆమె అతణ్ని వివాహం చేసుకుంది. మీ కిది తెలియకుండా వుండటానికి అత డిప్పుడు బొంబాయిలో వుంటున్నాడు. ఇచట తనకున్న స్నేహితులకు రాస్తున్న ఉత్తరాల ప్రకారం అతని అడ్రెసు '౪, హారింగ్టన్ రోడ్డు, బొంబాయి.' ఈ విషయాలన్నీ నేను మీకు రాయలేక రాయలేక రాస్తున్నాను. మీ కష్టానికి నా సానుభూతి"

ఈవుత్తరాన్ని ఒక్కనిమిషంలో చదివాను. తరువాత ఏం జరిగిందో తెలియదు. మళ్లా నాకు స్పృహ వచ్చేటప్పటికి మంచంమీద ఉన్నాను. మా నాన్న నాముఖం వేన్నీళ్లతో కాస్తూవున్నాడు. నన్ను చూచి ఆయన ఏడ్పు బిగబట్టుకోవడం గ్రహించాను. కాని నేను ఆపుకోలేకపోయాను. రెండుచేతులూ ఆయన మెడచుట్టూ పోనిచ్చి "నాన్నా" అంటూ బావురుమని యేడ్చాను. ఆయనకూడా కళ్లంబడి

నీళ్లు పెట్టుకున్నాడు. అప్పటికి మూడు గంటలయింది. ఇంకా భోజనం చేయలేదు. వంటమనిషి గడపదాకా వచ్చి వెళ్లిపోయింది. "అమ్మా, లే. ఏం చేస్తాం? మన ప్రారబ్ధం" అని అన్నాడు మా నాన్న. కాని లేవడానికి నాకు సత్తువ లేకపోయింది. విస్తరి గదిలోకే తీసుకు వచ్చింది వంటమనిషి. అయినా, ఏం సయిస్తుంది! మా నాన్న భోంచేశాడో లేదో తెలియదు. ఎక్కడకో బయటకు వెళ్లిపోయాడు.

మంచంమీదనుంచి పదిరోజులదాకా లేవలేదు. నా జీవిత సుఖస్వప్నాలు ఒక్కసారి పటాపంచలయినయి. ఒక్కసారి నా ఆశలన్నీ నిరాశలయినయి. నలుగురిలో నవ్వుబాట్లపాలవుతాను. జీవితావసరమే లేనట్లుతోచింది. ఎంతద్రోహం? మా నాన్న కష్టార్జితం తాను సుఖంగా అనుభవించి మాకా ద్రోహంచేశాడు? తనకోసం అజ్ఞాతవాసం చేస్తున్న భార్యను, ఆస్తిసర్వస్వ మొడ్డిన తనమామను నిరాశాపూరితులను జేసి, దుఃఖానలజ్వాలలలో ఆహుతిచేసి తాను ఆ తెల్లపిల్లతో కులుకుతున్నాడా? సహజమానవత్వాన్ని నిర్మూలింపజేసే ఈ పాశ్చాత్యవిద్యా సంపర్కాలు దేనికి, కాల్చనా? అయినా, మన బంగారం మంచి దయితే కంసాలిని వెక్కిరించడం దేనికి? విధి నాకిట్టి కఠినపరీక్ష ఎందుకు కలుగజేసిందో నాకర్థం కావడంలేదు. నేను చేసిన పాపం?

నేనూ, మా నాన్నా బొంబాయికి బయలుదేరాం. మా జీవితనౌక పగిలిపోయింది. ఒక తెప్ప కొరికింది మాయిద్దరికీ. పోయినంతదూరం పోతాం. లేదా, ఆ అనంతంలో కలిసిపోతాం. మే మిద్దరం ఒక హోటలులో బసచేశాం. మా నాన్న ఆ అడ్రసుప్రకారం ఆ యింటిని ముందు చూసిరావడానికి వెళ్లాడు. తిరిగితిరిగి సాయంకాలానికి హోటలుకు చేరుకున్నాడు.

"నాన్నా, కనబడిందా?"

"ఆ."

"వారు...?"

"ఆయనకూడా"

"పలకరించారా?"

"లేదు."

"ఎక్కడ?"

"కారులో. సాయంకాలంపికారుకో, క్లబ్బుకో వెళ్తున్నారు"

"ఒక్కరేనా?"

"కాదు."

"ఆ తెల్లపిల్ల..."

"ఆ! ఆమెకూడా..."

అయిదునిమిషాలదాకా ఒకరినొకరు పలకరించుకో లేదు. ఇంతలోకే సర్వెంటు భోజనం తీసుకు వచ్చాడు. నిశ్శబ్దంగా భోంచేశాం.

"ఏం నాన్నా, నీ కేమైనా ఆశ కనిపిస్తోందా?"

"లేదు"

"అయితే, యిక వెందుకు కలుసుకోవడం?"

"ఏదో మనస్సంతృప్తికి"

"వెళ్లిపోదాం నాన్నా"

"పిచ్చిపిల్లా! భయపడతా వెందుకు? అడుగుదాం, బతిమాలుదాం, ప్రాధేయపడదాం. మన ప్రయత్నాన్ని చివరలో వదిలెయ్యాడ మెందుకు? ఇప్పుడు మాట్లాడకుండా వెళ్లిపోయామంటే ఈ ఆశ నిన్ను ఆజన్మాంతం పీడిస్తూనేవుంటుంది."

చివరకు వెళ్లడానికే నిశ్చయించుకున్నాను. నా మనస్సు రాత్రంతా రేపు ఉదయం ఏం జరుగుతుందా అని ఆలోచించసాగింది. ఏదో కొంచెం నిద్రపోయాను.

కాని, అమర్నాథు మాకు గలిగిన శాస్తి చెప్పుదెబ్బలూ, శాపనార్థాలూ. మా నాన్నను జవానుచేత బయటకు గెంటేయించాడు. నేనింకా నా ప్రయత్నాన్ని వదలలేదు. లోపలనుండి తెల్లపిల్లనవ్వులు వికటాట్టహాసంతో నన్ను వెక్కిరిస్తున్నా, ఆ నిర్దయుడు-నాభర్త పాదఘాతాలు నాశరీరమంతా చిందింపచేసినా నా ప్రయత్నాన్ని నేను మానుకోలేదు. నా మంగళసూత్రం తెంపి క్రిందపారవేశాడు. ఇనపకాలిబూటుతో నా ముఖంమీద పెద్ద గాయం తగిలేటట్టు తన్నాడు. ఆ మెట్లమీదనుండి క్రిందకు పడిపోయాను. తలుపు డభీలుమని వేశాడు. లోపలనుండి నవ్వులూ, వేళాకోళాలూ బయలుదేరాయి. నిరాశ యెక్కువయినకొద్దీ నాలో

సీతాసావిత్రీపాతివ్రత్యభావాలు ప్రబలి నన్నా శిక్షకు బద్ధురాలిని జేసినయి. కాని, ఏం లాభం ? రాతిహృదయం యేం కరుగుతుంది ? తెల్లపిల్లకౌగిలిలో కరిగే ఆ నీచునకు ఈ భారతసాధ్వి మొర ఏమి వినిపిస్తుంది ? వట్టిది, వట్టిది!

*　　　*　　　*

గుంటూరు వచ్చేశాం. నా భర్తను గురించి నా స్నేహితులు నన్ను అడిగినప్పుడల్లా మనస్సులో పిడుగు పడినట్లయేది. ఇంకో సంవత్సరం చదువుందనీ, ఒక యేడు ఎప్రెంటిస్ చేయాలనీ తప్పించుకు తిరిగేదాన్ని. కాని, నా వెనకాలే వాళ్ల నవ్వులూ, వేళాకోళాలూ వినబడుతూ వుంటయి. ఎంత గ్రుడ్డిది యీ లోకం? ఎంత ఈర్ష్యతో నిండివుంది? నాభర్త నన్ను విడిచి వేయడం వాళ్ల సంతోషానికి హేతువా? మొన్న నేను మావూరు వెళ్తే లక్షప్రశ్నలు వేశారు ఆవూరివాళ్లు. "మీఆయన నిన్ను వదిలిపెట్టాడుటగా" అని ధైర్యంతో అడిగారు కొందరు. నానుంచి ఎలా అయినా "నా మొగుడు నన్ను వదిలిపెట్టాడు" అనిపించుదామని వారి కోరిక. శతవిధాల ప్రయత్నించారు. అది వారి కోకఆకలి వంటిది. ఆమాట ఒక్కటంటే సరి, వారి ఆకలి తీరిపోతుంది. ఇక మొదలెడ్తారు ఉపన్యాసాలు—యిప్పటి వాళ్ల నిర్లక్ష్యం, గర్వం, దర్పాలూ. "ఇంకేముంది, వాడొకదానితో లేచిపోయాడా, ఇది కూడా ఎవడితోనో చదువుకునే కుర్రాడితో లేచిపోతుంది. సతుకుతోందిగా మాలచదువు! భగవంతుడు బాగా అణిచాడు" ఎందుకనో వీళ్లకు నామీద అంత అకారణవైరం, కసి?

ఆవూళ్లో వుండలేక మానాన్న భూములన్నీ అమ్మకానికి బెట్టాడు. నేనుకూడా బి. ఏ. పూర్తిచేస్తాననీ, మద్రాసులో కాపరం పెడదామనీ, మన్ని కదిలించేవాళ్లు వుండరనీ సలహాయిచ్చాను. నా సంతోషమే ఆయనసంతోషం కనుక నాకోర్కెకు అంగీకరించాడు. ఎండాకాలపు సెలవ లవడంతోటే సామానంతా సర్దుకొని మద్రాసు వెళ్లి అక్కడ ట్రిప్లికేనులో నిశ్శబ్దంగా వుండేచోట ఒక చక్కని డాబా—ముందు గార్డనుగలది—ఒకటి తీసుకొని అందులో బసచేశాం. కాలేజీలు తెరవంగానే నను బి. ఎస్. సి. (ఆనర్సు) ప్రెసిడెన్సీ కాలేజీలో చేరాను. మానాన్న నా కీవిపత్తు వచ్చిననాటినుంచీ చాలా క్రుంగిపోయాడు. తన ఒక్క కూతురు, తన జీవితాశయం యిలా భగ్నమయిపోయింది కదా అని కుమిలిపోయేవాడు. చాలా రాత్రిళ్లు అతని దుఃఖంతో తలదిండ్లు తడిసి ముద్దలయేయి.

నాకు గతించిపోయే కాలం శుశ్రూష చేస్తూ వుంది. కాలం గడుస్తూవున్నకొద్దీ నాహృదయంలో యేర్పడ్డ గాయం మానుతూవస్తూవుంది. కాలేజీకి రోజూ వెళ్తూ వస్తూవుంటే, సాటి విద్యార్థినులతో కులాసాకబుర్లు మాట్లాడుతూవుంటే నాజీవితలత మరల చిగిర్చి పుష్పించబోతోందా అనిపించింది. కాని, కాలేజీ వదలిపెట్టి యింటికి వచ్చేసరికి ఆనిశ్శబ్దంలో నాజీవితఘట్టాలన్నీ ఫిల్ము తిరిగినట్లుగా తిరుగుతూ వుండేవి. ఒక్కొక్కప్పుడు క్లాసురూములోగూడా నా ఆలోచనలన్నీ పూర్వగాథలపై నిమగ్నమయివుండేవి. "ఏమిటి యిలా వున్నావు యివ్వాళ? ఏమన్నా ప్రేమజ్వరం వచ్చిందా ఏమిటి? ముఖం అలా కందగడ్డలా అయిపోయిందేం" అని వేళాకోళం చేసేవారు. ఒకప్పుడు వాళ్ల మాటలకు సమాధానమే చెప్పేదాన్ని గాదు. ఆ, ఊ అంటూ తప్పించుకుపోయేదాన్ని. ఒకేమాట రెండుమూడుసార్లు చెపితేగాని అర్థమయ్యేది కాదు ఆసమయంలో. ఎంతసంతోషంతో వున్నా ముఖంపై విచారం దేనికో తాండవిస్తూవుంటుంది. నా స్నేహితులంతా విసిగి నాపుటుకే అంతనుకున్నారు. అవును, నాజీవితరహస్యం వాళ్లకు తెలిస్తేగ! వాళ్లలాంటి బడబానలబాధలు యెరిగివుంటేగా! దుఃఖమంటే యేమిటో వాళ్లెరుగరు. ఇక సానుభూతి యెలా కలుగుతుంది?

ఇలా ఒక ఏడాది గడచిపోయింది. మానాన్న దిగులుతో నానాటికీ కృశించిపోతున్నాడు. మా యిద్దరికీ పెద్ద గాయం తగిలింది. నే నది మాన్పడానికై ప్రయత్నిస్తున్నాను. మానాన్న అది తరచితరచి పెద్దది చేస్తున్నాడు. రెండవ ఏడులో కొంతవరకు నేను నా మనోవిచారాన్ని అణచివేశాను. విశ్రాంతి సమయాల్లో నన్ను వెనుకటి ఆలోచనలు దుఃఖింపజేసినప్పటికీ నలుగురు స్నేహితులు వున్న సమయాన నేనూ వాళ్లంతసం

తోషంతో వుండగలుగుతున్నాను. నా పూర్వజీవితం దానంత టది వచ్చి నన్ను కలత బెట్టితే తప్ప ఆ ఆలోచనలు నా మనస్సులో ప్రవేశించటమే లేదు. మా నాన్న శుష్క వదనమే నాకు వాటిని జ్ఞాపకం చేస్తుంది. నా సంతోషంలో తానుకూడా పాల్గొందామని ప్రయత్నిస్తాడుగాని అది ఆయనశక్తికి మించిన పని అయిపోయింది. ఈమధ్య ఆయన ఆహారంకూడా తగ్గించి వేశాడు.

ఈ కాళరాత్రిలో, యీ జీవిత గాఢాంధకారంలో చంద్రోదయం.

సాయంకాలం కాలేజీ వదలి పెట్టినతర్వాత యింటికి తిరిగి వచ్చేస్తున్నాను. మనస్సంతా వెనుకటి ఆలోచనలతో వుంటే పరధ్యాన్నంగా ముందుకు నడిచేస్తున్నాను. ఈ స్వప్నావస్థలో నాకు ముందు పోయేదీ, వెనుకనుంచి వచ్చేదీ తెలియడం లేదు. ఈకలలు కంటూవుంటే హఠాత్తుగా నన్నొక గట్టి హస్తం యిసురుగా పక్కకు లాగింది. ఒక కారు ముందునుంచి వచ్చి నన్ను దూసుకువెళ్లిపోయింది. ఇదంతా క్షణికం. "క్షమించాలి. ఇక గత్యంతరం లేకపోయింది. మీరు మైమరచినట్లున్నారు" అన్నాడాయువకుడు. మనస్సు స్తిమితంలోకి వచ్చింది. ఎంత పరధ్యాన్నంతో నడిచానూ! సమయానికి ఈయువకుడు అడ్డంరాకపోతే నాజీవితం యేమయ్యేది? కృశించిన నాతండ్రి జ్ఞాపకం వచ్చాడు. "గాభరాపడ్డారా" అని అతడు పలకరించేదాకా నేను పక్కనున్న ఆయువకుని పూర్తిగా మరచిపోయినాను. నిజంగా నా ప్రాణదాత అతను. అతని వంక దీర్ఘంగా చూచాను. మా కాలేజీవరాండాలలో అప్పుడప్పుడు చూచినట్లు జ్ఞాపకం. మాట్లాడకుండా ముందరకు నడిచివేస్తున్నాం. నా పుస్తకాలు అతని చేతులోకి యెలా పోయాయో నాకు తెలియదు. విసురుగా లాగడంలో అవి పడివుంటాయి, అతను తీసివుంటాడు. నా ప్రాణాన్ని రక్షించినందుకు కృతజ్ఞత ఎలా తెలపాలో తెలిసిందికాదు. చివరకు యిలా అన్నాను : "సమయానికి మీరు దేవుడులాగా అడ్డపడ్డారు! లేకపోతే నాజీవితం ఏంకానూ?"

"ఎబ్బె, అలా అనకండీ! ఆసమయంలో ఎవరక్కడ వున్నా ఆపని చేసేవారు. నే నొట్టి నిమిత్తమాత్రుణ్ణి"

"అందరికీ ఆ సమయస్ఫూర్తి వుంటుందా?"

"మీసంతోషంలో నన్ననవసరంగా పొగిడేస్తున్నారు"

"మంచివాళ్ల కది సహజం. తాము చేసిన గొప్ప కార్యాన్ని గొప్పగా ఒప్పుకోరు. నిజంగా ఈనాడు మీరు చేసిన ఉపకారం నేను నాజన్మలో మరచిపోగలనా? అసలు ఈ ఋణాన్ని నేను తీర్చుకోగలనా"

వీ టన్నిటికీ సమాధానమన్నట్టు అత డొక్క నవ్వు నవ్వాడు. తర్వాత కుశలప్రశ్నలు వేసుకున్నాం. అతడు పోస్టుగ్రాడ్యుఏటుకోర్సు చదవడానికి ప్రెసిడెన్సీ కాలేజీలో యీ యేడే ప్రవేశించాడు. మేథమటిక్సుగ్రూపు. బయట వేరేగది తీసుకు వుంటున్నాడు.

ఇలా మాట్లాడుతూ మాట్లాడుతూ మాయింటి వద్దకు వచ్చాం.

"సెలవా?"

"ఇదేనా మీయిల్లు?"

"అవునండీ."

"నాగదికి దగ్గరే అన్నమాట."

"మీగదెక్కడది?"

"ఈ మేడపైన ఆవైపుగది" అంటూ మా యింటి కెదురుగా నున్న మేడపైన దూరంగా వున్న గదివైపు చూపించాడు.

"అయితే మీ రెప్పుడూ నాకిక్కడ కనపడనే లేదే?"

"అవును, నేను మొన్నమొన్నటిదాకా హాస్టలులో వున్నాను. కాని నా కావసతి చాలక రెండు రోజులక్రిందే ప్రత్యేకంగా యిక్కడ ఒకరూము తీసుకున్నాను."

"మాయిల్లు యిదే! అప్పుడప్పుడు కనిపిస్తూ వుండండి"

"థాంక్సు"

"వెళ్లొస్తానండీ"

నే నింట్లోకి వెళ్లిపోయాను. అతడు తన రూము వైపు వెళ్లిపోయాడు.

ఆ రోజునుండీ ఆ యువకుడు నాహృదయ ఫలకంలో స్థిరమైన నివాసం ఏర్పరచుకున్నాడు. అతడు కనపడి నపుడల్లా నా శరీరమంతా గగుర్పొడిచేది. అతని నేత్రాలు అగదికిటికీలోనుండి నన్ను ఆహ్వానిస్తూవుండేవి. కాలేజీవరాండాలలో మే మెప్పుడు ఒకరికొకరు ఎదురైనా మా దేహాలు వాటంతటవి ఆగిపోయేవి. ఒక్క నిమిషం అలా నిలబడిపోయేవాళ్లం. మాచేష్టలకు మేమే నవ్వుకొని ఎవరిదారిని వాళ్లు వెళ్లిపోయేవాళ్లం.

ఒకటిరెండుసార్లు టీకి పిలిచాను మాయింటికి. అతనంటే మానాన్నకు చాలా అభిమానం. నాప్రాణాన్నే కాకుండా, మానాన్నప్రాణాన్నికూడా నిలబెట్టింది ఆయువకుడే. వాళ్లిద్దరూ కులాసాగా మాట్లాడుకుంటూవుంటే నా కెంతో సర్దాగా వుండేది. కాని అప్పుడప్పుడు అతడు మాకు బాధగలిగించిన మాటకూడా వాస్తవమే. కాని, ఆమాటలు మాకు శూలాల్లాగా పొడుచుకుంటాయని అతనికి తెలియదు. ఒకసారి మానాన్నను అడిగాడు— "ఏమండీ, మీ అమ్మాయికి పెళ్లిచేయక, యిలా చదువులు చెప్పిస్తున్నారేమండీ" మానాన్నహృదయం చివుక్కుమంది. తల టేబిలుపైన ఆన్చి దుఃఖాన్ని దిగమ్రింగుతున్నాడు. "అయ్యో, ఎందుకు మీనాన్న అలా బాధపడుతున్నాడు? మీముఖంకూడా అలా అయిపోయిందేం?" ఏంచెప్పాలోనాకుతోచడంలేదు. నాభర్త నన్ను వదిలేసినాడని చెప్పాలా? నాకు పెళ్లికాలేదని చెప్పాలా? అయితే యీ దుఃఖం దేనికి ? చివరకు యిలా చెప్పాను: నాభర్తపైవున్న కోపం నన్నీమాటలు అనిపించింది. "నాభర్త చిన్నప్పుడే పోయాడు" మా నాన్న తలయెత్తి వికృతంగా నావంక చూశాడు ఒక్క నిమిషం. మళ్లా తల అలాగే దించివేశాడు. ఈప్రమేయం ఎందుకు తెచ్చానా అని ఆ యువకుడు పశ్చాత్తాపపడుతున్నాడు. తక్షణం లేచి "మీ మనస్సును అనవసరంగా కలవరపరిచాను. క్షమించాలి. వెళ్లొస్తాను. శ్యామలా" అంటూ చరచరా వెళ్లిపోయాడు. మేము అతన్ని ఆపదలచుకోలేదు. అతడు వెళ్లిపోయిన మరుక్షణం నేను మానాన్నవక్షంపై తలపెట్టి బావురుమని యేడ్చాను.

మానాన్న ఆ దెబ్బనుండి కోలుకోలేదు. క్షయ దగ్గు ఆయన్ను పీల్చిపిప్పిజేస్తోంది. నాకోరికపైన నా స్నేహితుడు మా యింట్లోకి తన వసతిని మార్చుకున్నాడు. మేమిద్దరం చేయగలిగినంత సాయం చేశాం. మంచి డాక్టర్లను పిలుచుకువచ్చి చూపించాం. వ్యాధి నానాటికీ ముదిరిపోతోంది. మానాన్నకు ఒక్కటే దిగులు. నాభవిష్యత్తు! నన్ను కడుపులోపెట్టుకు కాపాడే దగ్గరబంధువు లెవ్వరూ లేరు. నాభర్త నన్ను విసర్జించాడు. ఇకముందు నాగతి ఏమిటి ? ఇదే అతని మనస్సులో పరిపరివిధాల వేధిస్తూవుంది. ఈ ఆలోచనలు ఆయనకళ్లలో స్పష్టంగా కనపడుతూనే వున్నాయి. నేను కనపడితేచాలు, ఆయననేత్రాలు దుఃఖాశ్రువులతో నిండివుంటయి. నేను లేకపోతే ఒక్కక్షణంకూడా నిలవలేడు. కబురువెంట కబురు వస్తుంది. కాలేజీకి సెలవు పెట్టాను ఒక వారంరోజుల నుండి నా స్నేహితుడుకూడా సెలవు పెట్టాడు. ఇద్దరం అహోరాత్రాలూ ఆయనఆరోగ్యంకోసం కష్టపడుతున్నాం.

ఒకరోజు సాయంకాలం. మానాన్న ఆయాసంతో అప్పటిదాకా అవస్థపడి, సొమ్మసిలి నిద్రపోయాడు. నేనూ, నాస్నేహితుడూ ముందుతోటలో కూర్చున్నాం.

"శ్యామలా, మీనాన్నకు శరీరవ్యాధికన్నా, మనోవ్యాధి ఎక్కువనుకుంటాను."

"అవును."

"అది నీగురించ ?"

"అవును."

"నీభవిష్యత్తుగురించా?"

"అవును."

"శ్యామలా...!"

వులిక్కిపడ్డాను. అతని కంఠంలో కొత్తదనం కనబడింది. సామాన్యంగా పిలిచినట్లు పిలవలేదు.

ప్రాధేయపడుతూ, జాలిగా నన్ను సంబోధించినట్లున్నది ఆమాట, ఆస్వరం...

"శ్యామలా..."

తలెత్తి చూచాను. అత డేదో చెప్పలేక అవస్థ పడుచున్నట్లు కనపడినాడు.

"చెప్పు రామ్. ఎందుకు అనుమానిస్తావు?"

కొంచెంసేపు ఆగి, లేనిధైర్యం తెచ్చుకొని అన్నాడు: "శ్యామలా, నిన్ను నేను పెళ్లి చేసుకుంటాను."

రామ్‌ముక్తసరిగా అన్న యీ మూడుమాటలకూ నా హృదయం దద్దరిల్లిపోయింది. అలాంటి సంభాషణ ఆసాయంకాలం జరుగుతుం దని నేను కలనైనా అనుకోలేదు. అతని కేమి సమాధాన మివ్వాలో నాకు పాలు పోవడం లేదు. "నిన్ను చంపుతా" నని ఎవడైనా వచ్చి నన్ను బెదిరించినాగూడా అంత కంపించేదానను కానేమో. సమాధానం యివ్వడానికి నాకు కాలవ్యవధి కోసం అతడు దూరంగా ఉన్న మల్లెపొదదగ్గరకు వెళ్లాడు.

ఉద్దడి తగ్గినతర్వాత శాంతంగా ఆలోచించాను. అతన్ని నేను ప్రేమించానా అంటే, నువ్వు ప్రేమించావని నా మనస్సు సమాధాన మిచ్చింది. అవును, నా ప్రాణరక్షకుడు - నా తండ్రి అపాయస్థితిలో నాకు అడ్డుపడినవాడు- అతన్ని ప్రేమించకుండా ఎలా వుంటాను? ఆ ప్రేమ నా అంతరాళాల్లో నాకు తెలియకుండానే ప్రవహిస్తూవుంది. జీవితనాటకంలో అనేక దెబ్బలు తిన్న నాహృదయం ఆ కోర్కెను గమనింపలేకపోయింది. గమనించినా అణచివేయడానికి ప్రయత్నించింది. కాని, రామ్ అట్లాంటివాడు కాడు. నవయౌవనుడు. ప్రపంచం తన సుఖానికే సృష్టించబడిం దనే నమ్మకం లోనివాడు. అశాంతి ఎరుగని నిర్మలుడు. అందుచేత ప్రేమప్రవాహాన్ని ఆపుకోలేకపోయినాడు. కాని యిది ఉడుకురక్తం. తొందరపడి, తర్వాత పశ్చాత్తాప పడతారు. ఇప్పుడే గట్టిగా మోగించిచూస్తే మంచిది.

"రామ్, నువ్వు పొరబడుతున్నావు. యౌవనోద్రేకంలో మాట్లాడుతున్నావు. నేను వితంతువును. నీతల్లిదండ్రుల అనుజ్ఞ యింకా నువ్వు పొందలేదు. ఏదో మోహావేశానికి లోబడి, అదే ప్రేమ అనుకొని, తర్వాత విచారిస్తే లాభంలేదు. నీకూ, నాకూ శాంతీ, సుఖం లేకుండా పోతుంది. మా నాన్నను ద్రోహం చేసినవాళ్ల మవుతాం"

"శ్యామలా, నామాట నమ్ము. ఆలోచించకుండా నేను మాట్లాడటంలేదు. నీప్రాణం రక్షించిన మరుక్షణంనుంచీ నువ్వు నాదాన వనుకున్నాను. నిన్ను ప్రేమించాను. ఆప్రేమను పెంపొందింపజేశాను. నువ్వు వితంతువు నని చెప్పిననాటినుండీ నీపై ప్రేమ క్షీణించడంబదులుగా అభివృద్ధిచెందింది. సంఘం చేసిన ద్రోహాన్ని నేను తుడిచివేస్తానని ప్రమాణం చేశాను. మాతలిదండ్రులు యేమన్నా అనుకుంటా రని సందేహం వద్దు. నీకు మల్లేనే నాతల్లి నా చిన్ననాడే చనిపోయింది. కాని, మానాన్న మళ్లీ పెళ్లిచేసుకున్నాడు. సవితితల్లిఒత్తిడిలో వుండలేక నేను వేఱయిపోయినాను. అప్పుడప్పుడు మానాన్నవద్దనుండి వస్తున్న వుత్తరాలుగాక నాకు వాళ్లతో సంబంధమే తెగిపోయింది. నేనే నా పెళ్లిచేసుకున్నానంటే మా నాన్న తన భారం కొంత తగ్గిందని సంతోషిస్తాడు. మా సవితితల్లి సరేసరిగదా."

చాలా నిర్మలంగా, శాంతంతో మాట్లాడినాడు. అతని మాటలు నాహృదయంవరకూ చొరుచుకుపోయినయి. ఆతురతతో నా సమాధానంవంక యెదురుచూస్తున్నాడు.

"రామ్, నీవు నిజంగా దేవతాపురుషుడవోయి! నిజంగా నీ దెంత నవనీతహృదయం!"

ఇది అంగీకారసూచకంగా తీసుకొన్నాడు. రెండుచేతులూ రెండుచెంపలమీదా వేసి...

"రామ్! తొందరపడకు. యింకా మా నాన్న అంగీకారాన్ని మనం తీసుకోలేదు."

రామ్ మనస్సు చివుక్కు మంది. జాలితో నావంక చూశాడు.

"భయపడకు. మన సంతోషమే ఆయన సంతోషం."

ఇద్దరమూ యింట్లోకి వెళ్లాం. మా నాన్న యింకా నీరసంతోనే వున్నాడు. జ్వర మెంత వుందోనని వొళ్లుపట్టుకు చూచాను. గాబరాతో... "రామ్! దబ్బున వెళ్లు, డాక్టరును పిలుచుకురా." వళ్లు చలిముద్దగా వుంది. కళ్లెతో పాటు రక్తంకూడా పడి వుంది ఆ బేసిన్‌లో. పావుగంటలో డాక్టరు వచ్చాడు. ఏదో ఇంజక్షన్ యిచ్చాడు. గంటతర్వాత మా నాన్న కళ్లు తెరిచాడు. అతి కిష్టంమీద. మంచం దగ్గిరగా మేమిద్దరం నుంచొని వున్నాము. మమ్ములను చూసి కళ్లవెంబడి నీళ్లు కార్చేడు. నేను రామ్ చేతిలో నాచేతిని పోనిచ్చాను. మా నాన్న ముఖంలో ఆనందరేఖలు కనపడుతున్నయి. ఆతనికేదో ఆనందం కలిగినట్లూ, అదికూడా భరించలేకపోతున్నట్లూ మాకు బోధపడింది. మళ్లా పెద్ద దగ్గుతెర వచ్చింది. ఆ తెరలో మళ్లా రక్తం కక్కాడు. ఇదంతా చూస్తున్న డాక్టరు బయటకు వచ్చాడు. మేము కూడా ఆయనవెంట పోయాం. మేమిద్దరమూగూడా ఆయనవంక చూసి—

"డాక్టర్!..."

"మీ రిద్దరూ చదువుకున్నవాళ్లవడంచేత నిజం దాచదలచుకోలేదు. రేపు ఉదయందాకా ఈ ప్రాణి వుండదు."

నాకు పెద్దపెట్టున దుఃఖం వచ్చింది. నా కెన్ని కష్టాలు వచ్చినా అన్నీ తనే భరిస్తూ నాసుఖంకోసం పరితపించే మహోత్యాగి అతడు. నాకొరకే కెప్పుడూ విభిన్నంగా చేయలేదు. ఆయనజీవితాశయే నేను. కాని, ఆయనప్రయత్నాలను, కోరికలను, ఆశను మలమల మాడ్చింది విధి. ఆవిధిక్రూరతకు తా నెప్పుడేనా ప్రాణాలను అర్పించేవాడే. ఆజీవాన్ని నిలిపింది నేను. నాకోసం ఆయన జీవించాడు. భగవంతుడు ఆయన జీవితంలో ఒక్క మనస్సంతృప్తి యిచ్చాడు. అది తాను వెళ్లేటప్పుడు తన శ్యామల వంటరిగా వుండదనీ, ఆమెను కాపాడి సంరక్షించేవారు ఒక రుంటారనీ. డాక్టరు చెప్పినమాట వేదవాక్య మయింది. మా నాన్న రాత్రి రెండుగంటలకు పరమపదించాడు.

మే మిద్దరం కలిసే వుంటున్నాం. మాకు వివాహం అయిపోయినట్లే లెక్క. వాళ్ల నాన్న మమ్ముల నిద్దరనూ వకసారి చూడటానికి వచ్చి మమ్ములను ఆశీర్వదించి వెళ్లిపోయాడు. అదే మా వివాహ మంగళం. ఈ ఆదర్శవివాహానికి మా స్నేహితు లంతా కలిసి పెద్ద టీపార్టీ ఏర్పాటు చేశారు. దానితో మా ప్రేమశృంఖలాలు మమ్ములను యింకా గాఢంగా పెనవేసుకున్నయి.

జీవితం మామూలులోకి పడ్డది. రోజులూ, వారాలూ క్షణాలవలె గడిచిపోతున్నయి. చదువుకు స్వస్తిచెప్పాను. హాయిగా జీవితం గడిచిపోతోంది. రామ్ చదువు రెండేళ్లు పూర్తిచేసి ఫస్టుక్లాసుతో యం. ఏ. డిగ్రీ సంపాయించాడు. ఫస్టురాంకు వస్తుందని మేమంతా ఆశపడ్డాంగాని థర్డురాంకు వచ్చింది. ఆ కాలేజీలోనే లెక్చరరుపదవి ఖాళీవస్తే అందులో జేరాడు. మాజీవితనావ ఒడుదుడుకులలోనుంచి నిర్మల స్థానానికి చేరింది. భవిష్యత్తు మాముందు నవ్వుతూ నిలబడ్డది. ప్రకృతి ఎన్నాళ్లకు నాయందు దయచూపింది సంఘంపైన ఒక విధమైన విజయాన్ని పొందానని గర్వించాను. న న్నింక యేం చేస్తుందనే గర్వం కూడా నాలో ముఖంచూపింది. కాని, యీ జీవితాగాధంలో - పైకి నిర్మలంగా కనపడ్డా-అక్కడక్కడా దొంగపర్వతా లుంటాయనీ, అవిమన కు కనబడకుండా- మనము సంతోషంతో పులుకుతూవుంచే-మన ఆనందాన్ని- మన చక్కని నావను వేయిముక్కలుగా నాశనంచేస్తాయనీ నాకు తెలియదు. ఈజీవితంలో అంత అనుభవాన్ని యింకా సంపాదించలా. రాచకురుపు అంతా నయమయినట్లు పైకి కనిపిస్తుంది. చక్కగా మానుపడుతుంది. లొంగదీశానుగదా అని డాక్టరు సంతోషిస్తాడు. కాని, ఆమరుక్షణంలోనే మర్నాడు కట్టువిప్పి చూచేసరికి అంతా కుళ్లిపోయి ప్రాణానికే మోసం తెస్తుంది. ఇక మూడురోజుల్లో లేచి తిరుగుతా డనుకునే ఆజీవి సరిగ్గా ఆసమయానికే కాటికి దారితీస్తాడు. అదే లోకవిచిత్రం. అది దురూహ్యం. ఆకీలకం ఆ విధిచేతిలోనే వుంది.

* * * *

రెండు సంవత్సరాలు శాంతంగా గడచిపోయాయి. ఒకరోజు మధ్యాహ్నం భోజనా లయిన తర్వాత రామ్ యిలా అన్నాడు. "శ్యామలా, మధ్యాహ్నం ఒకస్నేహితుణ్ణి టీకి పిలిచాను. సరిగ్గా మూడు గంటలకు అన్నీ సిద్ధంచేయించు" అన్నాడు. మామూలుగా తనస్నేహితులను టీకి పిలవడం రాముకు అలవాటు. మరీ, క్లబ్బులో మెంబరుగా చేరిన తర్వాత ఈ స్నేహితు లెక్కువయ్యారు. శనిఆదివారాల్లో మరీ వస్తుంటారు ఈస్నేహితులంతా. కాని యీ ఆదివారం ఆయనధర్మమాఅంటూ ఒక్కణ్ణే పిలిచారు. నేనుకూడా చదువుకున్నదాన్ని అవడంచేత అతని స్నేహితులంతా నాకూ స్నేహితులయ్యారు. వాళ్లు రావడం నాకు కులాసాగా వుండటంచేత యీ దుబారాజీవితాన్ని నేను ఆటంకపెట్టడంలేదు.

మధ్యాహ్నం టీతోపాటు అదీ యిదీ తయారుచేశాను. సరిగ్గా మూడుగంటలకు కారు వచ్చి మా యింటిముందు ఆగింది. వచ్చింది ఆ స్నేహితుడే ననుకుంటూ. రామ్ వాకిట్లోకి వెళ్లాడు. ఇద్దరూ మాట్లాడుకున్నట్లు వినబడింది. టేబిలుమీద అంతా ఏర్పాటు చేసివుంది. లోపలకు వస్తున్నారు. తలెత్తి చూచాను. ఆస్నేహితుడు ఎవరు? ఎవరు? ఎ ... వ ... రు ...? మోహన్! మోహన్! మోహన్ మద్రాసుకు వచ్చాడా? రామ్‌కు స్నేహితుడా? నాహృదయావేదన వర్ణించడానికి నాకు మాటలు చాలడంలేదు! ఆ బాధ అలాంటి స్థితిలో వున్నవాళ్లకే తెలుస్తుంది.

మోహన్‌కూడా గుమ్మంముందు హఠాత్తుగా ఆగిపోయాడు. అతనుకూడా ఏదో మరిచిపోయిన వస్తువును జ్ఞాపకంచేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు కనబడ్డాడు. వెంటనే అతనిముఖంలో ఆశ్చర్యం పొడ సూపింది. రామ్ అతని అవస్థ చూడలేదు. "ఏమిటి శ్యామలా, యితన్ని నీవు యెరుగుదువా యేమిటి?"

"అవును, యెక్కడో చాలాఏళ్లక్రింద చూచినట్లు జ్ఞాపకం. అయినా, నే నెవరిగురించో పొరపడుతున్నా నని నాభావం."

"అంతే అయివుండాలి. ఎందుకంటే మిమ్మల్ని నేను యిదివరకు చూచినట్లు గుర్తులేదు."

దాంతో రామ్‌కు మాయిద్దరిమీదా వున్న అనుమానం తీరిపోయింది. టీ తీసుకోడానికి ప్రారంభించాం.

"శ్యామలా, యితనిసంగతి ను వ్వెరగవు. యితని జీవితం చాలా గమ్మత్తయింది. అది అతనే చెప్పాలి. ఏమోయి మోహన్, ఏదీ, నీ యిమేజినేషన్‌కు కొంత అవకాశ మియ్యి."

మోహన్ సందిగ్ధావస్థలో పడ్డాడు. నాకు తెలియని అతనిజీవితచరిత్ర యేముంటుంది?

"ఏమిటోయి మోహన్ అలా సిగ్గుపడతావ్? అయితే నేనే చెప్తానులే."

"ఇతను యింగ్లండు వెళ్లకముందు ఒక బ్లాక్ బ్రూటును (నల్ల గొడ్డును) పెళ్లిచేసుకున్నాట్ట. పెళ్లికి ముందు యితను ఆఅమ్మాయిని చూడనేలేదుట."

"రామ్"

"వుండవోయి, ఫర్వాలేదు...ఐ. సి. ఎస్. లో యితడు సెలెక్టవలేదు. తర్వాత బారిష్టరుపరీక్షకు కూచొని సెలెక్టయాడు. అక్కడి కల్లినవాళ్లకు అలవాటే కదూ. ఒక తెల్లపిల్లను వెంబడేసుకువచ్చాడు. ఇతడు రావడం ఎలా కనుక్కున్నారో కనుక్కున్నారు. వెంబడించారు వేటకుక్కల్లాగా. యితని మొదటిపెళ్లాం తండ్రిని వెంటపెట్టుకొచ్చింది. వాళ్ల నాన్నను బయటవాణ్ణి బయటే గెంటించివేయించాడు. పెళ్లాం కాళ్లావేళ్లా బడితే యినపకాలిబూటుతో తన్నాట్ట. పెద్ద గాయంకూడా..."

"అరే! శ్యామలా, నీ కాకంటిమీద అంత పెద్ద మచ్చేమిటి"

"సరిగ్గా యిక్కడేనా ఆ అమ్మాయికికూడా దెబ్బతగిలింది?"

నేను మోహన్‌వంక చూశాను. అతడు తల వంచుకున్నాడు. కాని, నేను మనస్థైర్యం చేసుకున్నాను. రామ్‌వాగ్ధాటి యింకా ఆగలేదు. "సాంతం విను. మధ్యమధ్య అడ్డుప్రశ్నలు వెయ్యకు. మనవాళ్ల ఉబలాటమేగాని వాళ్లు — ఆ తెల్లపిల్లలు సరిగ్గా

వుంటారూ? కొన్నాళ్లు వున్న తర్వాత మనవాడిమీద దానికి విసుగుపుట్టింది. అదీగాక మన యిండియనును చేసుకుం దని ఆమెను తనవాళ్లెవరూ ఆదరించేవారు కారు. ఈఅవస్థ భరించలేక అది ఒకరాత్రి తనవాడితో ఎవరితోనో లేచిపోయిందిట..."

"లేచిపోయిందా?"

"ఎందుకు నవ్వుతావ్?"

"ఏంలేదు"

"...మనవాడు నెత్తిన గుడ్డేసుకొని, అక్కడ నలుగురూ నవ్విపోతారని ఇక్కడకు చేరుకున్నాడు" అని తన ఉపన్యాసాన్ని ముగించాడు.

భగవంతుడు తగిన శిక్ష చేశాడుగదా అని సంతోషించాను. అవును, జీవితంలో కష్టాలు కొన్నాళ్లు, సుఖాలు కొన్నాళ్లు; రాత్రి కొన్నాళ్లు, పగలు కొన్నాళ్లు! నిన్ను అందలమెక్కించిన విధే నిన్ను క్రిందకు లాక్కొస్తుంది. సముద్రాన్ని ఉప్పొంగించి పొంగే బడబానలజ్వాలలు దానియందే అణగారిపోతయి.

సాయంకాల మయింది. ముగ్గురం బీచికి బయలుదేరాం. మాముగ్గురిలో సుఖాన్నీ, సంతృప్తినీ అనుభవిస్తోంది రామ్ ఒక్కడే. మాభావాలు యెక్కడెక్కడో విహరిస్తున్నయి. నాకు బొంబాయిలో గల్గిన పరాభవం అంతా కనులకు కట్టినట్లు కనపడుతోంది. మోహన్ కూడా సీరియస్‌గా ముఖం పెట్టి ముందుకు నడుస్తున్నాడు. రామ్ యేవో చక్కటి ప్రేమగీతికలు పాడుతో చలాకీగా నడుస్తున్నాడు. బీచికి చేరుకున్నాం. మేమిద్దరం సముద్రానికి కొంచెందూరంగా కూచున్నాం. ప్రకృతిలో కలిసిపోదామని కాబోలు రామ్ ఉత్తరీయము నడుముకు బిగించి సముద్రములోకి చొచ్చుకుపోయాడు.

దూరంగా సముద్రగంభీరత్వాన్ని బోలు హృదయాలను పెట్టుకొని నేనూ, మోహన్ బీచిఒడ్డున కూర్చున్నాం. నాకు అతనిని మాట్లాడించాలనే లేదు. నాహృదయంలో అతనికి యేవిధమైన స్థానమూ లేదు. ఏదైనా వుంటే అది వట్టి నీచభావమే.

"శ్యామలా"-ఉలిక్కిపడ్డాను. ఆమనిషిలో రసికత చూట్టం యిదే మొదటిసారి. ఎంత మృదువుగా, మనోహరంగా అన్నాడామాట! ఈ స్త్రీపైనే బొంబాయిలో యెంతపశువుగా ప్రవర్తించాడు? ఎంతలో ఎంతమార్పు!—

"శ్యామలా!"

మళ్లీ. అవును, యిప్పుడు జ్ఞాపకానికి వచ్చాను; యిప్పుడు అర్హురాల నయాను. "నీయిష్టమొచ్చిన చోటికి పో" అన్న ఆనోరు యేమయింది? మెళ్లోనున్న మంగళసూత్రం తెంపిన ఆచేయి యేమయింది? ఇనప కాలిబూటుతో తన్నిన ఆపాద మేమయింది? "శ్యామలా" అని యిప్పుడు లాలింపా? తుచ్ఛుడు!

మళ్లీ—"శ్యామలా"

ఇక మాట్లాడకుండా వూరుకోవడం బాగుండదనుకున్నాను. "దేనికి"

"జ్ఞాపక ముందా"

"ఏమిటి?"

"నేను..."

"మీరు? ఎవరూ?"

"నేను శ్యామలా, నేను. మోహన్‌ను..."

"మోహన్? మోహన్ ఎవరు?"

"నీ భర్త"

నాగుండె ఆగిపోయినట్లనిపించింది. "మీరు పొరబడుతున్నారు. నాభర్త (ఆనందంలో తేలియాడుచున్న రామ్‌వంక చూపించి) నాభర్త రామ్"

"అది కాదు. నీమొదటిభర్త"

"చచ్చిపోయాడు"

"కాదు, బ్రతికున్నాడు"

గట్టిగా అన్నాడీమాట. ఉలికిపడి రామ్‌వంక చూశాను. ఈశబ్దానికి రామ్ వెనక్కితిరిగి మావంక చూసి మళ్లీ తన ఆనందంలో పడిపోయాడు.

"మోహన్! నీవు చేజారినదానికై పరితపిస్తున్నావు. ఈశ్యామల వెనుకటి శ్యామల కాదు. తన వ్యక్తిత్వాన్ని, శక్తిని, గౌరవాన్ని గుర్తించిన శ్యామల.

శ్యామల తన మొదటిభర్తను మరచిపోయింది. చచ్చిపోయా డనుకుంది. ఆవిషయాన్ని తరచబోకు. నాకు మళ్లీ జ్ఞాపకంచేయబోకు. నువ్వు నారామ్‌కు స్నేహితుడవు. అలా వచ్చావు, అలా వెళ్లిపో"

ఇంతలోకే రామ్ స్నానం పూర్తిచేసి మమ్మ కలుసుకొన్నాడు. మేమిద్దరం యింటికి చేరాం. అతడు తన బసకు వెళ్లిపోయాడు.

మర్నాడు మధ్యాహ్నం రెండుగంట లయింది. వుదయం పదిగంటలకు కాలేజీకి వెళ్లాడు రామ్. ఒంటరిగా రుమాలు అల్లుతూ కూచున్నాను. వాకిట్లో బూట్సుచప్పుడు వినబడ్డది. "రామ్!" అంటూ ద్వారం తోసుకు లోపలికి వచ్చాడు మోహన్ !

"రామ్ లేడూ?"

"ఇవ్వాళ కాలేజీ వుందని తెలియదూ?"

"అరే, మరచిపోయాను"

అబద్ధ మాడుతున్నా డని గ్రహించాను. ఒక కుర్చీ వుంటే లాక్కొని కూర్చున్నాడు. దీర్ఘంగా నావంక రెండు నిమిషాలు చూశాడు.

"శ్యామలా, నీవు నాభార్యవు. రామ్‌ను చేసుకోడానికి నీకు హక్కు లేదు. హిందూధర్మ..."

"మోహన్, నువ్వు అనవసరంగా మాట్లాడుతున్నావు. నీకు నిన్ననే చెప్పాను-నాపైన ఆశ వదలుకోమని. నాభర్త లేని సమయంలో నీ విక్కడ వుండటం నా కిష్టంలేదు. మళ్లా అయిదుగంటలకు రా, మనమంతా కలిసి మాట్లాడుకోవచ్చు"

"నేను మళ్లీ యీయింటికి రాదలచుకోలేదు. ఇదే ఆఖరుసారి. కాని, నువ్వు నాతో వచ్చేయాలి."

"మోహన్, నువ్వు యీయింట్లోనుంచి తక్షణం లేచిపో"

"నేను వెళ్లను"

"నేను రామ్‌తో చెప్తాను"

నా బెదరింపు అతడు నిర్లక్ష్యంచేశాడు. పైగా వికృతంగా నవ్వి "నేనూ చెప్తాను. ఏం చెప్తానో తెలుసా? శ్యామల నాదనీ, నేను ఆమె మొదటిభర్తననీ చెప్తాను. తనకు నీమీద హక్కు లేదని చెప్తాను. నా సొమ్ము నా కిచ్చివేయమని అడుగుతాను."

"మోహన్!"

అతని మాటలు నాకు శూలాల్లాగా పొడుచుకున్నాయి. రామ్‌కు యింతవరకూ యీరహస్యం తెలియకుండా దాచాను. రామ్‌కు యీసంగతి తెలిస్తే యేమనుకుంటాడు! తన్ను ద్రోహం చేశానని అనుకోడూ? ఎంత మంచివాడయినా యిట్టి అవమానాన్ని భరించగలడా? రామ్‌ను నేను ప్రేమించాను. అతడు నా అంధకారజీవితంలో ప్రణయజ్యోతిని వెలిగించాడు. మే మిద్దరం హాయిగా జీవితాన్ని గడిపాం. మా నిర్మల సరోవరంలో నేడు యీ తుచ్ఛుడు బడబాగ్ని వేయడానికి సిద్ధపడ్డాడు. అతని ముఖం చూస్తే పులి నోట్లో లేడిని పెట్టుకొని "ఏం చేస్తావు?" అన్నట్లుంది. అతన్ని బెదిరించి లాభం లేకపోయింది. నేను బెదిరిస్తే మోహన్ తప్పక యీ విషమరహస్యాన్ని బయలుపెట్టేటట్లు వున్నాడు.

"మోహన్! యిప్పుడు మనం అయిపోయిం దానికై విచారిస్తే యేం లాభం చెప్పు. నన్ను ప్రేమించి పెళ్లాడిన రామ్‌ను యెలా వదిలిపెడతాను చెప్పు. అత నేమనుకుంటాడు? అయినా నన్నా విధంగా తృణీకరించిన నీవు మళ్లా యేముఖం పెట్టుకొని నన్నడుగుతావు?"

మోహన్ బతిమాలటం మాని పట్టుదలలోకి దిగాడు.

"అయిపోయిం దేదో అయిపోయింది. నేడు నేను నీవాణ్ణి. మన మిద్దరం కలిసి యెక్కడకో వెళ్లిపోదాం. సామాన్యంగా నీయిష్టం నీదని అతను వూరుకుంటాడు. వూరుకోక వెంబడిస్తాడూ, ఉన్న సంగతి చెప్పేదాం. వచ్చినదారిన వెళ్లిపోతాడు."

"మోహన్! నువ్వు నన్నవసరంగా తొందర చేస్తున్నావు. నాకు టైమివ్వు, అంతదాకా నే నేం చెప్పలేను."

"శ్యామలా...ఎంత తొందరగా అయితే..."

రామ్ వచ్చాడు.

రామ్ వచ్చేటప్పటికి మోహన్ నాకు చాలా సమీపములో వున్నాడు. మా మాటల సందడిలో అడుగుల చప్పుడుకూడా మాకు వినబడలేదు. అతడు హఠాత్తుగా రావడం చూసి మేము కొంతవరకు గాభరా పడ్డాం. మోహన్ దూరంగా వెళ్లిపోయాడు. రామ్ యివన్నీ నోటు చేశాడని గ్రహించాను. ఆ సాయంకాలం చాలా రిజర్వుడుగా వున్నాడు. మోహన్ ఒక గంటసేపు వుండి, తర్వాత పని వుందని వెళ్లిపోయాడు.

నేనూ, రామ్ బీచికి వెళ్లాం. ఆసాయింత్రం ఒకరినొకరు మాట్లాడించుకోలేదు. రాత్రి భోజనాలయినయి. తాంబూలం వారి చేతి కిచ్చాను. అది అందుకుంటూ యిలా అన్నారు:"శ్యామలా, నువ్వు మోహన్‌ను యిదివరకు యెరుగుదువా?" చాలా శాంతంగా అడిగారు యీ ప్రశ్న. ఆ శాంతమే నాహృదయాన్నంతా కలికివేసినట్లు వుంది. రామ్‌కూడా యేదో యమబాధ పడ్డట్టు కనబడుతున్నాడు. అతనిలో అనుమానపిశాచం పనిచేస్తోంది. చివరకు యిలా సమాధానం చెప్పాను:

"ఎందుకలా అనుకున్నారు?"

"మొదటినుంచీ నా కనుమానంగానే వుంది. మొదటిసారి మీరు ఒకర్ని ఒకరు చూచినప్పుడు ఎవరో చిరపరిచితులను చూచినట్లు గాభరా పడ్డారు. తర్వాత యివ్వాళ సాయంకాలం మోహన్ వచ్చింది నాకోసంకాక నీకోసమని తెలుస్తూవుంది."

"మీ అనుమానాలకు ఆధారం లేదు."

"ఎందుకని?"

ఉలిక్కిపడ్డాను. ఆ ఒక్క మాటలో ఈర్ష్య, అసూయ, కోపం అన్నీ యిమిడివున్నయి. నేను సమాధాన మివ్వలేదు. అంతటితో మా సంభాషణ పూర్తయింది.

మర్నాడు రెండు గంటలకు "శ్యామలా!" అంటూ మాట వినబడ్డది. క్రిందకు దిగి వెళ్లబోయాను. రామ్ నన్ను ఆపి "వుండు. అతన్ని రానియ్యి" అన్నాడు. మేడమెట్లెక్కుతూ "శ్యామలా" అన్నాడు. పలకలేదు. మేమున్న తలుపు తోసుకొని—

"శ్యామ...రామ్! కాలేజీకి వెళ్లలేదూ?"

రామ్ మాట్లాడలేదు. నే నన్నాను:

"అవును. యివ్వాళ తలకాయ నెప్పిగా వుంటే కాలేజీకి సెలవు పెట్టారు!"

"అరె, నాకు తెలిసిందిగాదు."

తొందరలో అన్నాడీ మాట. తర్వాత నాలుక కొరుక్కున్నాడు. రామ్ తీక్ష్ణంగా చూశాడు నావంక.

"ఇప్పుడెలా వుంది?"

"కొంచెం నయం."

ముగ్గురం నిశ్శబ్దంగా అయిదు నిమిషాలు కూచున్నాం. ఎవరు ఏవిషయం మాట్లాడాలో తెలిసింది కాదు. నేను కాఫీ పెట్టడానికి కిందకు పోయాను. కాఫీ పెడుతూవుంటే నాకు పైన అరుపులూ, కేకలూ వినబడ్డాయి. పరిగెత్తుకొని పైకి వెళ్లాను. ఇద్దరూ కొట్టుకుంటున్నారు. బలహీను డవడంచేత రామ్‌ను క్రింద పడవేశాడు మోహన్. అలా నొక్కి కూచున్నాడు.

"మోహన్!"

నన్ను చూచి లేచాడు. రామ్ లేచి తలవంచుకున్నాడు. మోహన్‌ను బయటకు సాగనంపాను.

"చెప్పావా?"

"ఇంకా లేదు."

హృదయం కుదటబడ్డది. తలుపు వేసి పైకి వెళ్లాను. రామ్ మామూలుగా మంచంమీద పడుకున్నాడు. క్రిందకు వెళ్లి కాఫీ తయారుచేసి తీసుకువచ్చి యిచ్చాను. కాఫీ తీసుకొని ముఖం రెండవవేపు తిప్పుకొని పడుకున్నాడు. కదిలిస్తే ఎక్కడ హుంకరిస్తాడోనని భయమేసింది.

రెండురోజులు కాలేజీకి వెళ్లలేదు. భగవంతుని దయవల్ల మోహన్‌కూడా మాయింటిచాయల రాలేదు. ఆ మర్నాడు కాలేజీకి వెళ్లాడు. పదకొండు గంటలయింది. వాకిటి ముందు కారుచప్పుడయింది. "శ్యామలా!"—మళ్లీ వచ్చాడు మోహన్.

"మోహన్! యింకా మమ్మల్ని వదల్లేదూ?"

"నేను రామ్‌కు చెప్పనందుకు నువ్వుచేసే సన్మానమా యిది ?

"అది కాదు మోహన్. నా జీవితంలో నువ్వు రెండుసార్లు అడ్డుపడ్డావు. నాకై నే నెక్కువ విచారించను. కాని నీ మూలంగా రామ్‌కు మతికూడా పోయే టట్లుంది."

నవ్వుతూ అన్నాడు: "శ్యామలా? నువ్వు అనవసరంగా నామీద నింద మోపుతున్నావు. నిజమే— నిన్ను ప్రథమంలో విడిచిపెట్టటం నా తప్పే. కాని ఆ తప్పును పరిహరించడానికి నీ వెందుకు అంగీకరించవు? నిన్ను నేను మళ్లీ స్వీకరిస్తాను. నీ జీవితాన్ని మధురంగా చేస్తాను. నీ సుఖంకై నాశాయ శక్తులా పాటు పడతాను. నా మాట నమ్మి."

ఈ కల్లమాటలు నేను నమ్మడం లేదు. నమ్మక చేసేదీ లేదు. రామ్ నావంక జాలిగా చూస్తున్నాడు. అతన్ని నేను ప్రేమించాను. అతన్ని మనసారా కోరి పెళ్లి చేసుకున్నాను. అతన్ని నేను మోసపుచ్చలేను.

"మోహన్, నన్ను వదులుకో. నీతో నేను రాను."

జాలిగా- "రావూ?"

"రాను."

బెదిరిస్తూ—"రావూ? అవును, నువ్వు మంచి మాటలతో ఎందుకు ఒప్పుకుంటావు? రామ్‌తో యీ విషయం అటో యిటో తేల్చేస్తే మంచిది."

"మోహన్, నువ్వు రాక్షసుడవు. నీకు జాలీ లేదు, దయా లేదు!"

"నాపైన నీకు జాలి వుంటేగదా నీపైన నాకు వుండటానికి! అయినా యీ అనవసరపు మాటలతో వృథాగా కాలక్షేపం దేనికి? రాత్రి మూడుగంటలకు నేను కారుమీద మీయింటికి వస్తాను. అయిదుగంటలకు కలకత్తా పోయే ట్రెయిను వుంది. దానిపైన మనమిద్దరం వెళ్లిపోదాం. నువ్వు అలా రాకపోతే మర్నాడు వుదయం అన్నివిషయాలూ రామ్‌కు చెప్పేస్తాను"

"మోహన్, మోహన్!..."

నామాట వినిపించుకోకుండా కారుమీద వెళ్లిపోయాడు.

నిస్పృహతో యింట్లోకి వచ్చాను. కుర్చీలో కూచున్నానో లేదో, బయట చప్పుడు వినపడ్డది. లోపలికి వస్తున్నారు ఎవరు? మోహనా? కాదు రామ్!

"మన వాకిట్లో కారాగింది, ఎవరిది"

"లేదే!"

"లేదూ?"

"లేదు."

అంతే, మళ్లా అయిదు నిమిషాలదాకా మాటల్లేవు.

"యివ్వాళ మధ్యాహ్నమే వచ్చారేం?"

"ఈ పూట సెలవుపెట్టాను. తలకాయనెప్పి యెక్కువగా వుంది."

అబద్ధం! నన్ను పరీక్షచేద్దామని వచ్చారు. మధ్యాహ్నం కాఫీకాచి యిచ్చాను. తాగారు. ఏవో పంకజ మల్లిక్ ప్లేట్లుంటే ఫోను పెట్టాను. నెమ్మదిగా, హాయిగా పాడుతూవుంటే ఆ సంగీతం మాదుఃఖంవలె పొంగి వెల్లువయై పారుతున్నట్లనిపించింది. సాయంకాలం బీచికి బయలుదేరాము. మాట్లాడకుండానే ముందుకు నడిచాం. నామనస్సంతా ఖంగారుగా వుంది. ఆబీచివొడ్డున అనేకదంపతులు ఆనందంతో మాట్లాడుకుంటూవుంటే వాళ్లంతా మావంక చూచి వెక్కిరించిన ట్లనిపించింది. దూరంగా యిసుకతిన్నెలమీద నిశ్శబ్దంగా కూర్చొన్నాం. నాహృదయం అతన్ని మాట్లాడించటానికీ, అతన్ని నాదగ్గిరిగా చేర్చుకోడానికీ ఆరాటపడుతోంది. ఆ విచారముఖంతో, ఆ సముద్ర ఆకాశాలు బ్యాక్‌గ్రౌండుగా, రామ్ ఎంత అందంగా వున్నాడూ! ఆసముద్రం నాహృదయంవలె ఆరాటపడుతోంది. నాప్రియుడు నాకు దూరమౌతున్నట్లూ, మేఘాల్లో కలిసిపోతున్నట్లూ అనిపించింది. మోహన్ నన్ను యీడ్చుకువెళ్తున్నట్లూ, దూరంగా రామ్ కళ్లనీళ్లు పెట్టుకున్నట్లు అనిపించింది. రామ్‌ను మాట్లాడించకుండావుండలేకపోయాను. "రామ్...." మాట పెగిలిరావడంలేదు. మోహన్ నాగొంతు నలిమివేస్తున్నట్లనిపించింది. "రామ్! నన్ను నీవు ప్రేమించడం లేదూ?" రామ్ నావంకకు తిరిగాడు. కళ్లు ఎర్రగా

వున్నాయి. ఆసముద్రంముందు తన హృదయావేదన అంతా వెళ్లబోసుకొంటువుంటాడు. పాపం! అతడు నా వంక దయతో, జాలితో చూచాడు. ఒక్క నిమిషం. తర్వాత తన హృదయానికి నన్ను గట్టిగా అదుముకున్నాడు. ఆ పవిత్రసన్నివేశంలో నాహృదయం ఆగలేక బిగ్గరగా యేడ్చింది. ఇంటికి తిరిగివచ్చేశాం.

సావిట్లో గోడగడియారం టిక్కు టిక్కుమంటూ వుంది. ప్రతిసెకండూ ఒక బాణంలాగా నాహృదయంమీదగా దూసుకుపోతోంది. ఆ గడియారం "నేను ఆగను, నేను ఆగను" అంటూ నన్ను వెక్కిరిస్తోంది. "మూడుగంటలకు కారు తెచ్చి వుంచుతాను, నువ్వు రావాలి" అంటూ మోహన్ గర్జిస్తున్నాడు. రామ్ నాకిచ్చిన గాఢాలింగనం మరుపుకు రావడంలేదు. ఏదో యంత్రంరీతిగా పనులు చేశాను. ఏ పని చేద్దామన్నా చేయి రావడంలేదు. రామ్‌ను చూస్తే చాలు, నాహృదయం ఝల్లుమంటోంది. అతని అమాయకపుచూపులు మరుపుకు రావు. మోహన్ నన్ను ప్రేమించడంలేదు. అతనిలో ఈర్ష్యాభావం విజృంభించి వుంది. "తన సొమ్మును యితరులు అపహరించారే" అనే అహంభావత్వం అతనిలో యేర్పడింది. నా యొక్క కష్టాల్ని తన కాక సాకుగా యేర్పరచుకొని నామీద అధికారం చెలాయిద్దామని చూస్తున్నాడు. నేను వాని దాన్నయితే ... నన్ను గడ్డిపరకగా భావిస్తాడు. కాని అది అసంభవం.

నా హృదయంలో రామ్ ఒక్కనికే స్థానం వుంది. రక్షించినా, శిక్షించినా, నన్ను అనేక హింసలు పెట్టినా అచంచలమైన ప్రేమ. కరకుగొడ్డలితో కొట్టిన కిరాతకునకు గంధపుచెట్టు చక్కని సువాసననే యిస్తుంది. అలాంటి ప్రేమ నాది. కాని రామ్‌ప్రేమ అటువంటిది కాదు. రామ్ సామాన్య మానవుడు. నేను తనదాన్ని అవుతానుగదా అనే స్వలాభాపేక్షతో నన్ను ప్రేమించాడు. కాని, నాయందు విశ్వాస ముంచలేకపోయాడు. తన్ను ప్రేమించిన శ్యామల యితరులను కన్నెత్తయినా చూడదనే నమ్మకం అతనిలో లేదు. అందువల్లనే రామ్‌కు నిజం తెలుస్తుందేమోనని భయం. నేను మోహన్‌భార్యననీ, అతడు విడిచిపెట్టడంవల్ల మళ్లీ పెళ్లిచేసుకున్నాననీ రామ్‌కు తెలుస్తే అతడు భరించలేని సత్య మది. ఒకవేళ తన యింటిలో వుండటానికి రామ్ అంగీకరించినా మేము వెనుకటివలె నిష్కల్మషంగా ప్రేమించలేము. వెనుకటివిషయాలు రాహువుల్లాగా మమ్మలను వెంటాడుతూనేవుంటాయి. అలాంటి జీవనం నరకంకంటే అన్యాయం. దానికంటే చావు.....

ఏమన్నాను? "చావు వుత్తమం" అంటున్నాను గదూ. మూడు గంటలకు కారు వచ్చి ఆగుతుంది. నేను వెళ్లాలి. వెళ్లలేను. వెళ్లకపోతే మర్నాడు వుదయం మోహన్ వస్తాడు. వచ్చి రామ్‌కు అంతా చెప్పేస్తాడు. అప్పుడు రామ్ నావంక చూస్తాడు. ఆచూపులో వేయి నరకాలలో పడే బాధ వుంటుంది. అలాంటి చూపు నేను భరించగలనా? "ఇది నిజమేనా" అని నన్ను రామ్ అడిగితే నే నేమని జవాబు చెప్పాలి? మా యిద్దరిలో వున్న పాతపరిచయం యిదివరకే గ్రహించాడు. దానికే అతడు ఆగలేకుండావున్నాడు. ఇదికూడా బయటకు వస్తే తనతో వుండనిస్తాడా? "రామ్." "ఆ!" —ఎవ రామాట్లాడింది? కాదు, గడియారం అరగంట కొట్టింది. క్రిందకు వెళ్లి చూసివచ్చాను. పదకొండున్నర గంటలయింది. ఇక మూడున్నరగంట లుంది. ఏమిటి?

నాజీవితం. అవును. నన్ను ప్రేమించే తల్లీ, తండ్రీ ఇదివరకే గతించారు. నన్ను ప్రేమించే నా రామ్ రేపటితో నన్ను విసర్జిస్తాడు. మోహన్ నావంక చూసి వికృతంగా నవ్వి "వస్తావా, రావా?" అంటాడు. చివరకు నాగతి? నన్ను నానాహింసలూ పెట్టి, మంగళసూత్రం తెంపి, కాలిబూటుతో తన్నిన ఆమోహనే శరణ్యమా? ఛీ...

దూరంలో సముద్రపుహోరు వినిపిస్తోంది. మళ్లీ గడియారం పండ్రెండు గంటలు కొట్టింది. రామ్ కొంచెం మంచినీళ్లు తాగి నిదురించాడు. ఆ నిశ్శబ్దంలో బయట సముద్రపుఘోష, యింట్లో గడియారం టిక్ టిక్ ధ్వని స్పష్టంగా వినిపిస్తున్నాయి. గడియారపు ముల్లు నా హృదయంలో గిరగిరా తిరుగుతోంది. సముద్రపుఘోష యింకా స్పష్టంగా వినబడుతోంది. అదిగో గంట. అదిగో మోత.

మంచంమీదనుంచి లేచాను. క్రిందకు దిగాను. మళ్లీ గంట కొట్టింది. టైము ఒంటిగంట. మెల్లిగా తలుపు తీశాను. మళ్లీ దగ్గరకు వేశాను. రోడ్డు నా ముందు నిదురిస్తోంది. మెల్లగా నడిచి వెళ్లాను. కాళ్లు వెనక్కు పీకుతున్నయి. అవును. నా రామ్‌ను నేను విడిచి వెళ్లగలనా? అతడు నన్ను క్షమిస్తా డని నా అంతరాత్మ ఎక్కడో బోధిస్తూవుంది. కాని, దానిమీద ధైర్యం లేకపోయింది.

కాని, రామ్ నిజాన్ని యెలా గ్రహిస్తాడు? అతనికి తన శ్యామల యేమయిందో యెవరు చెప్తారు? నేనే చెప్పాలి. మళ్లీ యింటివేపు తిరిగాను. ఇక దాదాపు రెండుగంట లుంది. రామ్‌కు వుత్తరంరాయాలి. లోపలికి వెళ్లి, ఒక గదితలుపు తోసి, టేబిలుముందు కూర్చొని వుత్తరం రాశాను. అదే యీ వుత్తరం:

"ప్రియమైన రామ్!

ఇదే నాజీవితగాథ. ఈ నా గాథను నీకు వ్రాయనట్టే రాశాను. నాజీవిత మనే నాటకరంగంలో నువ్వుకూడా ఒక పాత్రధారి వవడంచేత నిన్నుసంబోధించకుండానే యీ నాగాథను విపులపరచాను. నిన్ను విడిచి వెళ్లిన యీ నీ శ్యామలను మరచిపోకు. అదిగో సముద్రఘోష న న్నాహ్వానిస్తోంది. గంట రెండున్నరకు దాటిపోయింది. బయట వెళ్తూవున్న ప్రతికారూ మనయింటిముందు ఆగుతుందేమోనని భయంగావుంది. రామ్, నన్ను క్షమిచవూ? అదిగో...అదిగో సముద్రపు మోత..."

* * *

వుదయాన మామూలువేళకు లేచాను. శ్యామల కాఫీ తెచ్చియిస్తుంది కదా అని అలాగే పడుకునివున్నాను. కాని ఎంతసేపటికీ శ్యామల అజలేదు. సరే తప్పనిసరిగా లేవాలిసొచ్చింది. మేడ క్రిందకు దిగివచ్చాను. ఇంకా బద్ధకం పోలేదు. పనిమనిషి గది ఊడుస్తోంది.

"ఏమే, శ్యామ లేదే?"

"ఏమో బాబూ! యింకా అమ్మగారు క్రిందకు రాలేదు."

"అయితే తలుపు తీసిం దెవరు?"

"నేను వచ్చేటప్పటికి అది తీసే వుంది బాబయ్యగారూ."

పైకి వెళ్లి చూశాను. ఎక్కడా కనబడలేదు. క్రిందకు వచ్చి మళ్లీ పనిచేసేదా న్నడిగాను.

"ఏమే, తలుపు తీసుందా?"

"అవును బాబూ."

"ఎక్కడకు వెళ్లివుంటుంది? ఆ మోహన్‌గాడితో ఏమైనా రాత్రివేళ వెళ్లిపోయిందా? నా శ్యామల అంత కృతఘ్నురా లనుకోను."

ఇంతలోకే నా కాహోలుమధ్య టేబిలుమీద పెద్ద కాగితాలకట్ట కనబడ్డది. దానిపైన ఫ్లవర్ పాట్ వుంది. ఆ కాగితలకట్ట తీసి చూశాను. "రామ్‌కు" అని రాసి వుంది శ్యామలదస్తూరిలో. గబగబా తీసి చూశాను. దానిలో యిలా వుంది:

"ఇటు చూడండీ! దేనికండీ..."

ఆసాంతంగా చదివాను. నన్ను నేను నమ్మలేకపోయాను. శ్యామల—నా శ్యామల—నా హృదయం. ఎటువంటి శీలవతిని పోగొట్టుకున్నాను! ఆమెకు ఎంత ద్రోహం చేశాను! ఎంత అనుమానించాను! రెండు రాతిహృదయాలమధ్య నలిగిపోయింది ఆ నవనీతహృదయం.

వాకిటిలో చప్పుడయింది. మోహన్ వచ్చాడు. "శ్యామల వుందా?"-ఎంత ధైర్యంగా అడిగాడు! అతని ముఖాన ఆ కాగితాలకట్ట పారవేశి పైసి వెళ్లాను. అరగంటదాకా అలాగే నిశ్శబ్దంగా కూర్చున్నాను. దూరంగా వున్న సముద్రం నన్ను చూసి నవ్వుతోంది. నాశ్యామల ప్రతి అలలో, ప్రతిబిందులో వూగులాడుతోంది సంతోషంతో. ఆమెఅనిర్వచనీయమైన విచారం సముద్రఘోషలో వ్యక్తమాతోంది. అప్పుడప్పుడు శ్యామల ఆ సముద్రంలోనుండా తన జాలిచూపు నావంక ప్రసరిస్తోంది.

బయట కారుచప్పుడయింది. మోహన్ వెళ్లిపోయాడు. "మీ కాగితాల కట్ట యిదుగో బాబూ" అంటూ పనిమనిషి ఆ కాగితాలను నా చేతి కిచ్చింది. అవి నా హృదయానికి అదుముకొని ఏడ్చాను.